క్లుప్తంగా

బదిలీలపై టీచర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: బదిలీలకు సంబంధించిన విధి విధానాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ రవి అవగాహన కల్పించారు. 8 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, రేషనలైజేషన్‌లో వస్తున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఏవైనా సందేహాలున్న పక్షంలో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళమిస్తున్న రాంబాబు, నాగ శిరీష

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం ప్రకాశం జిల్లా ఒమ్మవరం గ్రామానికి చెందిన కె. రాంబాబు, నాగ శిరీష కుటుంబ సభ్యులతో కలిసి 1,00,116 రూపాయలను ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం వారికి వేదపండితులు గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆశీర్వచనం పలికారు. స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌కు పీహెచ్‌డీ

రేణిగుంట: మండలంలో కృష్ణాపురం పంచాయతీలోని శ్రీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ టి.శేషగిరి కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్నారు. ‘ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్’కు సంబంధించి ఆయన సమర్పించిన పరిశోధన పత్రాలకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కళాశాల చైర్మన్ దామోదరం, వైస్ చైర్మన్ వేణుగోపాల్, కరస్పాండెంట్ వెంకటరమణ ఆయన్ను అభినందించారు.

శ్రీకాళహస్తి అటవీశాఖాధికారిగా సునీల్



తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి అటవీ శాఖాధికారిగా పోల్లకట్ల లోకేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టు పని చేయాలని సిబ్బందికి సూచించారు. వన్యప్రాణులను వేటాడటం చట్ట రీత్యా నేరమని, వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అటవీభూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య కడప రేంజ్‌కు బదిలీపై వెళ్లారు.

వేడుకగా జాతర.. నిమజ్జనం



పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో గురువారం గంగ జాతర వేడుకగా నిర్వహించారు. ఆదివారం ప్రారంభమైన జాతర మూడు రోజుల పాటు గెరిగ ఉత్సవం నిర్వహించారు. బుధవారం రాత్రి గంగమ్మను ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. మంగళ హారతులతో నైవేద్యం సమర్పించారు. ఉదయం అమ్మవారికి నడివీధిలో కొలువుదీర్చారు. భక్తుల దర్శనానంతరం గురువారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి కుంభ భోజనం నైవేద్యంగా సమర్పించి బలిదానం ఇచ్చారు. ఆ తర్వాత ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. జాతర ఏర్పాట్లను సర్పంచ్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహం వితరణ

రామచంద్రాపురం: మండలంలోని పీవీపురం పంచాయతీ బలిజపల్లెకు చెందిన పల్లవి, శంకరయ్య దంపతులు రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీభవానీ శంకరుల ఆలయానికి ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాన్ని గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆంజనేయస్వామి విగ్రహానికి పంచద్రవ్యాలతో అభిషేకించి, స్నపన తిరుమంజనం చేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వలంటీర్లే సంక్షేమ సారథులు





గ్రామ వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, హాజరైన గ్రామ వలంటీర్లు

- ‘వలంటీర్లకు వందనం’లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, ప్రతిపక్షం కుట్రలను ఎండగడుతూ, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ఎంతగా పాటు పడుతున్నారో ప్రజలకు వివరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఐదుగురు వలంటీర్లను సేవారత్న, 233 మందికి సేవామిత్ర అవార్డులతో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో ఎమ్మెల్యే వారిని ఘనంగా సన్మానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య సంక్షేమ సారథులు వలంటీర్లేనని కొనియాడారు. వలంటీర్లు ప్రజా సేవకులని, వారికి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలువురు వలంటీర్లు మాట్లాడారు. ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించి, గౌరవ వేతనంతో సమాజంలో గుర్తింపునిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబును ఎమ్మెల్యే, పార్టీ నాయకులు శాలువా కప్పి, గజమాలతో ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

సత్యవేడు: మండలంలోని కొత్తమారి కుప్పం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తారని మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అన్నింటా అభివృద్ధే ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీ కాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి సచివాలయ పరిధిలోని కొత్తకండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాల్లో కొందరు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి నవరత్నాలతో పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే పార్టీ కార్యాలయంలో నేరుగా తెలియజేయవచ్చన్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య ఉందని ప్రజలు నివేదించడంతో ఆయన స్పందించారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్చనా దేవి, మునిరత్నం, సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటాచలం, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, నాయకులు కోవి చంద్రయ్య నాయుడు, రమణయ్యనాయుడు, వడ్లతాంగల్ బాలాజీరెడ్డి, రమణారెడ్డి, రామచంద్రారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో మహా కుంభాభిషేకం





నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి విగ్రహం, పూర్ణాహుతిలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- అభయ ఆంజనేయస్వామి ఆలయ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: శ్రీకాళహస్తి–సత్యవేడు మార్గంలోని సాయిబాబా ఆలయం ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయ మహా కుంభాభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కుంభాభిషేకం పూజల్లో గురువారం ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తుశాంతి ప్రవేశబలి, అంకురార్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, మొదటి కాలయాగ పూజలు, హోమ పూజల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో పాటు ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయ కార్య నిర్వాహకులు నాగభూషణం, శ్రీదేవి దంపతులు, వేదపండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి విగ్రహానికి ఉన్న తెరలను వేదపండితులు తొలగించడంతో ఆంజనేయస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అప్పు తెచ్చిన గొడవ

–ఇరువర్గాలపై కేసు

రేణిగుంట: ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు గాజులమండ్యం పోలీసులు గురువారం తెలిపారు. పోలీసుల కథనం..మండలంలోని కుర్రకాల్వకు చెందిన సునీత కొన్ని రోజుల క్రితం తిరుచానూరు పద్మావతిపురానికి చెందిన చంద్రమౌళికి రూ.10లక్షలు అప్పుగా ఇచ్చింది. తనకు అప్పు తిరిగి చెల్లించాలని కొన్నిరోజుల క్రితం పద్మావతిపురానికి వెళ్లి చంద్రమౌళిని నిలదీసింది. దీంతో బుధవారం రాత్రి చంద్రమౌళి భార్య శోభ కుర్రకాల్వలోని సునీత ఇంటికి వచ్చి వాగ్వాదానికి దిగింది. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి కొట్టుకున్నారు. ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రమౌళి దంపతులతో పాటు సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న గుంతకల్ డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రేణిగుంట రైల్వేస్టేషన్‌లో గుంతకల్ డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి గురువారం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేశారు. తొలుత యార్డ్‌ను, ఆ తర్వాత ప్లాట్‌ఫాంలో ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. తాగునీటి వసతిపై ఆరా తీసి, వేసవి దృష్ట్యా రైల్వే స్టేషన్‌లో విధిగా మంచినీటి కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం తీరు, ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లను పరిశీలించి అధికారులకు సలహాలు–సూచనలు ఇచ్చారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

పిచ్చాటూరు: మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు మధుసూదన్ రావు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా పులికుండ్రం వద్ద అరుణానదిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచాలని స్థానిక పోలీసులకు తహసీల్దారు రాతపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. తమ శాఖ నుంచి ఇద్దరు వీఆర్‌ఓలు, ఇద్దరు వీఆర్‌ఏలకు అక్రమ రవాణా కట్టడి విధులు కేటాయించామన్నారు. ఇసుక రవాణాకు గతంలో ఇచ్చిన పర్మిషన్లను రద్దు చేసినట్లు చెప్పారు. ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా ఇసుక తరలిస్తే అక్కడే వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు.

కులం పేరిట దూషించి అవమానం



ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం ఫిర్యాదు నకలు చూపుతున్న బాధితులు

- టీడీపీ నేతపై ఎస్పీకి ఫిర్యాదు

కేవీబీపురం: కులం పేరుతో దూషించి, అవమానించిన టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి మండలంలోని రాజులకండ్రిగ దళితవాడకు చెందిన దళితులు గురువారం ఫిర్యాదు చేశారు. వారి కథనం..గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి(గ్రామ కంఠం)లో దళితులు చందాలు వసూలు చేసి గుడి నిర్మాణానికి పూనుకున్నారు. అయితే స్థానిక టీడీపీ నేత (అనధికార సర్పంచ్) లోకినాయుడు ఆ పనులకు అడ్డు తగిలారు. ఆ స్థలం తమ కార్యకర్తలకు సంబంధించినదని, అక్కడ గుడి నిర్మాణం ఆపాలని అల్టిమేటం ఇచ్చారు. ఇదే విషయమై వాడలో జరిగిన సమావేశంలో స్థానిక మహిళతో లోకినాయుడు దురుసుగా ప్రవర్తించారు. ఆ తర్వాత ఒంటరిగా వస్తున్న ఆ మహిళను అడ్డగించి కులం పేరుతో దూషించడంతోపాటు దాడికి యత్నించాడని బాధితురాలు ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ప్రశ్నించిన పలువురిని కూడా దూషించాడని గ్రామస్తులు నివేదించారు. ఈ ఘటనపై గత మంగళవారం కేవీబీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపించారు. ఇకనైనా తమకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చారు.

ఆ నేత అక్రమాలపై విచారణ చేయరూ!

గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఎస్సీ, బీసీల భూములను లోకినాయుడు ఆక్రమించుకున్నారని, ప్రశ్నించిన వారిపై దాడులకు, బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధిత మహిళలు ఆరోపించారు. పథకాలకు దరఖాస్తు చేస్తామంటూ తమ చిరునామాలతో అక్రమాలకు పాల్పడుతున్నారని, పోలినాయుడు కండ్రిగ, రాజులకండ్రిగ గ్రామాల్లో కొండ, గుట్టలకు కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వ అధికారాన్ని అడ్డుపెట్టుకుని పాసు పుస్తకాలు చేసి బ్యాంకుల్లో రుణాలు కూడా పొందాడని పేర్కొన్నారు. ఆయన అవినీతిపై విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు, బీసీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలి

సత్యవేడు: పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా శాఖ జనరల్ సెక్రటరీ పి. తివిక్రమ రావ్ కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఉద్యోగ విరమణ చేసిన రోజునే ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలన్నారు. పీఆర్సీ అమలు విషయంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల మేరకు ఆర్థిక పరమైన బకాయిలు, డీఏ అరియర్స్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జీ.జయప్రసాద్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ జీఎస్. గోకులేంద్ర, సెక్రటరీ బీఎం.రవికుమార్, కోశాధికారి శైలేంద్రకుమార్, విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మీపతి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశులు, వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష



మాట్లాడుతున్న ఈఈ మోహన్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గూడూరు హౌసింగ్ ఈఈ మోహన్‌రావు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి హౌసింగ్ పథకంలో మంజూరు చేసిన 941 ఇళ్లలో 722 ఇళ్లకు భూమి పూజ చేశారని, 602 పూర్తయ్యాయని, 120 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇక, గ్రామాల్లోని వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలను బట్టి వారికి బిల్లులను, సిమెంట్‌ను చెల్లిస్తామన్నారు. సమావేశంలో డీఈ శ్రీనివాసరావు, ఏఈ సుబ్రమణ్యం, సిబ్బంది యుగంధర్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విప్పమానుపట్టెడలో గర్భవతులకు చేస్తున్న సామూహిక సీమంతం

- సామూహిక సీమంతం

రేణిగుంట: మండలంలోని విప్పమానుపట్టెడలో గురువారం వేమాపురం సంజీవరెడ్డి 21వ వర్ధంతి పురస్కరించుకుని సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి సామూహిక సీమంత కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని గర్భవతులకు సీమంతం చేసి దుస్తులు, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. జెఎం క్లినిక్ డాక్టర్ జలజ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ పేరుతో తాను తమ తండ్రి ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

‘జగనన్నకు చెబుదాం’తో సమస్య పరిష్కారం

- చేతిపంపు రిపేరు చేయలేదని టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు
- మరమ్మతులు చేయించిన గ్రామ సర్పంచ్, కార్యదర్శి





హ్యాండ్ బోరుకు చేస్తున్న మరమ్మతులు, రిపేరు చేయడంతో వస్తున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామ బీసీ కాలనీలోని చేతిపంపు పనిచేయకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు పర్యాయాలు సచివాలయంలో, సర్పంచ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో విసిగి వేసారిన కాలనీ వాసులు ‘జగనన్నకు చెబుదాం’ టోల్ ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి సమస్యను నివేదించారు. అప్పటివరకూ పట్టించుకోని వారు ఉరుకులు పరుగులతో అక్కడికి చేరుకున్నారు. బోరు మెకానిక్ చేత రిపేరు చేయించారు. బోరు హెడ్‌తోపాటు మూడు పైపులు మార్చారు. తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆరునెలలుగా పరిష్కారం కాని సమస్యను జగనన్నకు చెబుదాంతో పరిష్కరించారని ఫిర్యాదుదారుడు వెంకటరమణ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో 60 వరకూ కుటుంబాలు ఉన్నాయని, కొళాయిల్లో సక్రమంగా నీళ్లు రానప్పుడు హ్యాండ్ బోరే నీళ్లే తమ అవసరాలను తీర్చేదని గ్రామస్తులు చెప్పారు.

గాలీవాన బీభత్సం

- నేలకొరిగిన రేకులు, చెట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు



ఎండీపుత్తూరులో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



ఎండీపుత్తూరులో ఇంటిపై పడిన చెట్టు

ఏర్పేడు: మండలంలో గురువారం సాయంత్రం గాలీవాన ధాటికి పలు గ్రామాల్లో చెట్లు, రేకులు, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని మడిబాక, ఏర్పేడు, ఎండీపుత్తూరు, రాజులకండ్రిగ, అంజిమేడు తదితర గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. ఎండీపుత్తూరు మిట్ట ఇండ్లులో మామిడి చెట్టు కూలి అంకయ్య, గంగయ్య, ఎస్సీ కాలనీలో గురవయ్య, జయచంద్ర, నాగరాజు, వీరరాఘవయ్య రేకుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఏర్పేడులో వెంకటగిరి రోడ్డు రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎండీపుత్తూరు, మడిబాక, రాజులకండ్రిగ తదితర గ్రామాల్లో 10 ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. ఇసుకతాగేలిలో విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. గ్రామాలు అంధకారంలో మునిగాయి. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.



ఆగిన ట్రాఫిక్



వెంకటగిరి రోడ్డులో కూలిన విద్యుత్ స్తంభం



నిరాశ్రయులను పరామర్శిస్తున్న గున్నేరి కిషోర్ రెడ్డి

జోరు వాన..



తిరుమల బైపాస్ రోడ్డులో కూలిన వృక్షం

తిరుపతి: తిరుపతి నగరంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సవం సృష్టించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరవాసులు భానుడి భగభగలతో అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణ మారిపోయింది. భారీ గాలులతో వర్షం కుమ్మరించింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బలమైన గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, ఫ్లెక్సీలు నెలకొరిగాయి. ఇంటిపైనున్న రేకులు ఎగిరి పడ్డాయి. పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించాయి.